# కానిస్టేబుల్ కిష్టయ్య భార్యకు ఉద్యోగోన్నతి

- లైబ్రేరియన్‌గా మాచారంలో పోస్టింగ్

కరీంనగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : అమరుడు పోలీస్ పుట్టకొక్కుల కిష్టయ్య భార్య పద్మావతికి ఎట్టకేలకు లైబ్రేరియన్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగోన్నతి కల్పించడంలో పద్మావతికి అన్యాయం జరుగుతోందని ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో ప్రత్యేక కథనం ప్రచురించింది. అమరుడు పోలీసు కిష్టయ్య భార్యకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఏడాది కాలంగా నిలిచిపోయిన పదోన్నతిని కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. పద్మావతి ఇంటర్మీడియెట్ విద్యా శాఖలో టైపిస్టుగా కరీంనగర్‌లోని బాలికల కళాశాలలో పనిచేస్తున్నారు. ఆమెకు ప్రస్తుతం లైబ్రేరియన్‌గా పదోన్నతి కల్పిస్తూ కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో పోస్టింగ్ ఇచ్చారు. కానిస్టేబుల్ కిష్టయ్య కూడా ఇదే ఏరియాలో ఆత్మార్పణం చేసుకున్న విషయం తెలిసిందే. కాగా తన పదోన్నతికి సహకరించిన కమిషనర్ దేవసేన, డైరెక్టర్ బుర్ర వెంకటేశంకు పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతునొక్కే ప్రయత్నం



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌ని వారిస్తున్న కమిషన్ చైర్మన్, సభ్యులు

కరీంనగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్ : బీసీ కమిషన్ రాజకీయాలకు అతీతంగా ఏర్పడిందని చెప్పిన చైర్మన్ మాటలు ఆచరణలో మాత్రం కనిపించ లేదనే విమర్శలు వచ్చాయి. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, 42 శాతం అమలు చేయకుంటే తమ పార్టీ పక్షాన ఆందోళన తప్పదని చెప్పిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. పార్టీ నుంచి ఒక్కరు మాత్రమే మాట్లాడాలనడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ వాదనకు దిగారు. కొద్దిసేపు ఎమ్మెల్యేలు వాదించినా ఒక్క కౌశిక్‌రెడ్డికి మాత్రమే అవకాశం ఇచ్చారు. ఆయన మాట్లాడుతుండగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు బీసీ నాయకులు 'బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గో బ్యాక్' అంటూ నినదించారు. అనంతరం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడే ప్రయత్నం చేయగా బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అడ్డుకున్నారు. తర్వాత కలెక్టర్ ఆడిటోరియం నుంచి బయటికి వచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ, ఇది విచారణ కమిషన్‌గా కనిపించడం లేదని, కాంగ్రెస్ విచారణ కమిటీగా కనిపిస్తున్నదని విమర్శించారు. ఈ కమిషన్ చెల్లదని కోర్టు డైరెక్షన్ ఇచ్చినా ఈ బహిరంగ విచారణ దేనికని ప్రశ్నించారు. ఎవరైనా కోర్టుకు వెళ్లితే విచారణలో తీసుకున్న అభిప్రాయాలన్నీ కొట్టివేస్తారని అన్నారు.

### బీసీల పక్షాన మాట్లాడేందుకే వచ్చాం



బీసీ కమిషన్‌కు కోర్టు వాలిడిటీ లేదన్నప్పటికీ విచారణలో బీసీల పక్షాన తమ వాదనను విన్నవించాలనే గౌరవంతో నేను కౌశిక్ రెడ్డి వచ్చాం. కానీ, ఇక్కడికి వచ్చిన తర్వాత నాకు కనీసం సమయం ఇవ్వలేదు. ఇది కమిషన్ విచారణలా లేదు. కాంగ్రెస్ పార్టీ విచారణలా కనిపించింది. జిల్లాలో కేవలం బీఆర్ఎస్ పక్షాన మాత్రమే మేం కలిసేందుకు వచ్చాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. అది నెరవేరకుంటే ప్రజలతో కలిసి పోరాడుతాం. ఈ కమిషన్ నిజాయితీతో పనిచేస్తున్నదా..? లేదా అనే అనుమానం వస్తున్నది. నిజాయితీగా పనిచేస్తోందంటే ఏ కాంగ్రెస్ ఒక్క నాయకుడు కూడా ఇక్కడికి ఎందుకు రాలేదు? కోర్టు చెప్పిన విధంగా ప్రత్యేక కమిటీ వేయాలని మేము కూడా డిమాండ్ చేస్తున్నాం. ఈ కమిషన్‌పై మాకు చాలా అనుమానాలు ఉన్నాయి. ప్రత్యేక కమిషన్ వేయాల్సిందే. ఒక ఎమ్మెల్యే అభిప్రాయం చెప్పేందుకు అవకాశం ఇవ్వకుంటే ఇక సామాన్య బీసీలకు విలువ ఎక్కడిది?

**- డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల ఎమ్మెల్యే**

### మొత్తం తూతూ మంత్రమే



బీసీ కమిషన్ చెల్లదని నిన్ననే కోర్డు డైరెక్షన్ ఇచ్చింది. రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ వేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పక్కన పెట్టింది. కేవలం రాజకీయం కోసం తప్పితే ఈ కమిషన్ విచారణలో ఎక్కడా చిత్తశుద్ధి కనిపిస్తలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అనేది తూతూ మంత్రంగా చేయాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం కనిపిస్తున్నది. కమిషన్ ముందు హాజరై వాదనలు వినిపించాలని అన్ని పార్టీలకు ఆహ్వానాలు పంపింది. కానీ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, బీజేపీ ఎంపీ ఎందుకు రాలేదు? కోర్టు ఒకటి చెబితే, ప్రభుత్వం ఒకటి చెప్తున్నది. రేపు ఎవరో ఒకరు కోర్టుకు వెళ్తే ఇప్పుడు చేసే ప్రజాభిప్రాయాన్ని కొట్టివేయరన్న గ్యారెంటీ ఏంటీ? బీసీల సంక్షేమంపై కేవలం కేసీఆర్‌కు మాత్రమే చిత్తశుద్ధి ఉంది. మా పార్టీ పక్షాన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. సంజయ్ ఒక ఎమ్మెల్యే అని కూడా చూడకుండా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వక పోవడం చాలా బాధాకరం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినపుడు బీసీలకు రూ. లక్ష కోట్లు పెడతామని చెప్పింది. మొన్న బడ్జెట్‌లో ఎందుకు పెట్టలేదు. బీసీ కమిషన్ విచారణ మొత్తం రాజకీయ డ్రామాగా చెప్పవచ్చు.

**- పాడి కౌశిక్ రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే**



బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు



బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌడ సంఘ నాయకులు

# బీసీ కమిషన్ ఎదుట బీసీల గోడు

- సమస్యలు ఏకరువు పెట్టిన బీసీ కుల సంఘాల ప్రతినిధులు
- ఏడు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్నదని ఆవేదన
- రిజర్వేషన్లు పెంచాలని, హామీలన్నీ కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని డిమాండ్
- ఉదయం నుంచి సాయంత్రం వరకు వినతులు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న బీఆర్ఎస్
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికే మాట్లాడే అవకాశం
- కోరుట్ల ఎమ్మెల్యే విన్నపాన్ని వినని బీసీ కమిషన్ చైర్మన్
- అనంతరం మీడియా ఎదుట ఆగ్రహించిన ఎమ్మెల్యేలు
- కనిపించని కాంగ్రెస్, బీజేపీ ప్రతినిధులు

బీసీ కమిషన్ ఎదుట బీసీ సంఘాల ప్రతినిధులు గోడు వెల్లబోసుకున్నారు. ఏడు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతున్నదని వాపోయారు. స్థానిక సంస్థల్లో 42 శాతం కాకుండా 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అలాగే విద్య, ఉద్యోగాల్లోనూ ఈ దామాషాలోనే రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు పాల్గొనగా, బీసీ నాయకుల ముసుగులో ఉన్న కాంగ్రెస్ నాయకులు 'గో బ్యాక్' అంటూ నినదించారు. పార్టీలకు అతీతంగా బహిరంగ విచారణ జరుగుతున్నదని కమిషన్ చైర్మన్ చెప్పినా.. ఒక్క ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికే మాట్లాడే అవకాశమిచ్చి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను మాట్లాడకుండా అడ్డుకున్నారు. అనంతరం మీడియా ఎదుట ఇద్దరు ఎమ్మెల్యేలు ఆగ్రహించారు. ఇది రాజకీయ సభ కాదని చెబుతూనే అధికారాన్ని ఉపయోగించి తమ గొంతు నొక్కే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.



బీసీ కమిషన్ ఎదుట మోకరిల్లిన బీసీ సంఘం నాయకుడు శ్రీనివాస్



సమావేశానికి హాజరైన కుల సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు

కరీంనగర్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్ : స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసేందుకు శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ నిర్వహించిన బహిరంగ విచారణలో సంబంధిత కుల సంఘాల ప్రతినిధులు వారి గోడును వెల్లబోసుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన ఈ విచారణలో బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రంగు బాలలక్ష్మి, రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్‌తోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ కులాల్లో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి ఆయా సంఘాల ప్రతినిధులు కమిషన్ ఎదుట వాదనలు వినిపించారు. గాండ్ల తిలకుల, యాదవ, కుర్మ, బేడ బుడిగ జంగాలు, వీర క్షత్రీయ, రజక, స్వర్ణకార, కమ్మరి, శాలివాహన, పూసల, దూదేకుల, గౌడ, మున్నూరు, బలిజ, గంగపుత్ర, ఆరెకటిక, ముదిరాజ్, తదితర 20కి పైగా కుల సంఘాల ప్రతినిధులు ఈ సందర్భంగా కమిషన్ ఎదుట తమ సమస్యలు ఏకరువు పెట్టారు. తమ కులాల దామాషా ప్రకారంగా 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. అదే సమయంలో గత ఎన్నికల్లో ఉదయ్‌పూర్ సభలో బీసీల కోసం ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏడు దశాబ్దాలుగా బీసీలకు అన్యాయం జరుగుతున్నదని, ఇప్పటికైనా న్యాయం జరగాలని, లేని పక్షంలో ఉద్యమం తప్పదని కొన్ని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. బీసీ సంఖ్యా పరంగా ఉన్నా అధికార పరంగా లేరని, అధికారం ఉంటేనే ఇంకొకరికి ఇచ్చే స్థితిలో ఉండే వారిమని, ఇప్పుడు అడుక్కునే స్థితిలో ఉన్నామని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా 80 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ పార్లమెంట్‌లోనే చట్టం తేవాలని పలువురు బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

### 50 శాతం పెంపుపైనే అధిక విజ్ఞప్తులు

వెనుకబడిన తరగతుల వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పురోగతిపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన బీసీ కమిషన్‌కు యాభై శాతం రిజర్వేషన్ల పెంపుపైనే అత్యధిక విజ్ఞప్తులు వచ్చాయి. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ప్రకటిస్తారని భావిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన దరఖాస్తుల్లో సుమారు 60 శాతానికి పైగా అవే ఉన్నట్టు అధికారుల ద్వారా తెలుస్తున్నది. రిజర్వేషన్ల పెంపు కోసమే కమిషన్ అధిక ప్రాధాన్యత ఇవ్వాలంటూ విజ్ఞప్తులు రావడంతో సభ్యులు వీటిపై ఆసక్తిగా చర్చించుకోవడం కనిపించింది. అలాగే, గ్రూపుల మార్పుపైనా ఆయా కులాల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తాయి. కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల వ్యవహారశైలితో కొన్ని కులాల వారు ఆయా కులాల గ్రూపులను వీడి ఇతర కులాల గ్రూపుల్లో చేరి ధ్రువీకరణ పత్రాలు పొందారని, దీంతో ఆయాగ్రూపుల్లో పోటీ ఏర్పడి అసలైన వారికి అన్యాయం జరుగుతున్నదంటూ వినతిపత్రాలు అందాయి. గతంలో బీసీ–ఏ గ్రూపులో రజక, నాయీబ్రాహ్మణ కులాలతోపాటు కేవలం 32 కులాలకు చెందిన వారు మాత్రమే ఉండగా, తాజాగా 60 కులాలను చేర్చడంతో అర్హులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారంటూ ఉమ్మడి జిల్లాలోని రజక, నాయీబ్రాహ్మణ కులాలకు చెందిన పలు సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఉన్నత కులాలకు చెందిన వారు కూడా బీసీ–ఏ గ్రూపులో రిజర్వేషన్ పొందుతుండగా, తమ కులాలు వెనుకబాటుకు గురవుతున్నాయని, ఆయా కులాలను తమ గ్రూపులో నుంచి తొలగించాలంటూ కమిషన్ బృందానికి విన్నవించుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ముదిరాజ్‌లు మినహా ఓడ బలిజ, బెస్త, గంగపుత్ర కులాలకు చెందిన వారు నామమాత్రంగానే ఉన్నా వేల సంఖ్యలో కుల ధ్రువీకరణ పత్రాలు అధికారులు జారీ చేసినట్టు పలువురు ఆధారాలతో సహా కమిషన్‌కు అందజేశారు. జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన పలు కుల సంఘాల ప్రతినిధులు అక్రమంగా తమ కుల గ్రూపుల్లో చొరబడి విద్య, ఉద్యోగ రంగాల్లో తమకు అందాల్సిన అవకాశాలను ఎగరేసుకుపోతున్నారంటూ కమిషన్ ఎదుట ఏకరువు పెట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కూడా తమ పాలిట శరాఘాతంగా మారుతున్నాయని, వాటిని సత్వరమే రద్దు చేయాలంటూ పలు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. తక్కువ సంఖ్యలో ఉన్న ఓసీల కోసం పది శాతం రిజర్వేషన్లు అమలు చేస్తుండగా, ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో తమ కులాల్లోని యువత అత్యధిక మార్కులు పొందినా, సీట్లు లభించలేదంటూ కమిషన్ ఎదుట వాపోయారు. క్వాలిఫై అయిన ఓసీ అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో సీట్లు పొంది, దర్జాగా ఉన్నత విద్య, ఉద్యోగాలు చేసుకుంటున్నారంటూ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తేనే ఆర్థికంగా ఎదుగుదల సాధ్యమవుతుందని వినతిపత్రాలు అందజేశారు. స్వీకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి అందిస్తామని కమిషన్ సభ్యులు వెల్లడించారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డుమ్మా

బీసీ కమిషన్ విచారణలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొనాలని సమాచారం ఇచ్చారు. కానీ, ఉమ్మడి జిల్లా పరిధిలోని కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు హాజరు కాలేదు. కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కలిసి విన్నవించినట్టు కమిషన్ చైర్మన్ నిరంజన్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఈ నేపథ్యంలో చాటుగా కమిషన్‌ను కలిసి తమ వాదనలు వినిపించడం ఏమిటని బీసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తామంతా కలెక్టరేట్‌లో ఉంటే నాయకులు అక్కడ కలవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తమ కులాలపై కాంగ్రెస్ నాయకులకు ఎంత చిత్తశుద్ధి ఉన్నదో అర్థమవుతోందని స్పష్టం చేస్తున్నారు.

### మొత్తం 213 అర్జీలు..

వినతిపత్రాలు అందజేయడంలో గందరగోళం నెలకొనకుండా హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్లను వేర్వేరుగా ఆడిటోరియంలో ఆవరణలో ఏర్పాటు చేశారు. కరీంనగర్ నుంచి 99 విజ్ఞప్తులు, జగిత్యాల నుంచి 29, పెద్దపల్లి నుంచి 32, సిరిసిల్ల నుంచి 53 అర్జీలు మొత్తంగా 213 స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. అలాగే, కమిషన్ చైర్మన్, సభ్యులు మాట్లాడుతుండగా రెండుసార్లు విద్యుత్ అంతరాయం కలిగింది. దీంతో సమావేశ స్థలిలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఐదు నిమిషాలకు పైగా కరెంట్ నిలిచిపోవడంతో సంబంధిత యంత్రాంగం వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించింది. సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తినట్టు వెల్లడించింది.

# కులగణనలో తప్పు చేస్తే క్రిమినల్ చర్యలు

- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

కరీంనగర్,నవంబర్ 1(నమస్తే తెలంగాణ)/ కలెక్టరేట్ : కుల గణనలో క్షేత్రస్థాయిలో తప్పుడు సమాచారం నమోదు చేసినా, ఇచ్చినా క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నామని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కులగణన అనేది ఒక బృహత్తర కార్యక్రమమని, దాని తర్వాత బీసీలు ఎంత శాతం ఉన్నారనేది తెలుస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 వేల మంది ఎన్యుమరేటర్లతో కుల గణన చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తిగా రాజకీయాలకతీతంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి పార్టీలు సహకరించాలని కోరారు. తమ కమిషన్‌కు అడ్వొకేట్ జనరల్ కూడా సలహాలు, సూచనలు చేస్తున్నారని, బిహార్, కర్నాటక రాష్ట్రాల మాదిరి కాకుండా బీసీల తక్షణ న్యాయం జరిగేలా తమ కమిషన్ రిపోర్టు ఉంటుందని వెల్లడించారు. ఆంధ్రా నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన అక్కడి ఓసీ కులాలు ఇక్కడ బీసీ సర్టిఫికెట్లు పొందుతున్న విషయమై నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమని, తెలంగాణలో కూడా కొందరు బీసీలు కాకున్నా ఆ కులాలుగా నమోదు చేయించుకుంటున్నారని, ఈ విషయాన్ని కూడా పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు. కుల గణనలో కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన అవసరం లేదని, కుటుంబంలో ఒకరు ఉండి ఆధార్ కార్డు ఆధారంగా ఎన్యుమరేటర్లకు వివరాలు అందిస్తే సరిపోతుందని చెప్పారు. రాష్ట్ర జనాభాలో బీసీల సంఖ్య తేల్చేందుకే సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. సమావేశంలో కలెక్టర్లు పమేలా సత్పతి, కోయ శ్రీహర్ష, సత్యప్రకాశ్, ఆర్డీవో మహేశ్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం 'నీళ్ల'పాలు

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అక్కడక్కడా వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- ఆందోళనలో అన్నదాతలు

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ)/రుద్రంగి/ వీర్నపల్లి/ కాల్వశ్రీరాంపూర్/ఓదెల: అకాల వర్షం ముంచుతున్నది. శుక్రవారం ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా పడిన వాన రైతన్నను ఆగం చేసింది. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా.. కొనుగోళ్లు మొదలు కాకపోవడంతో తెచ్చిన ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల వడ్లు కొట్టుకుపోగా, అన్నదాతలకు దుఃఖమే మిగిలింది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంతోపాటు కొలనూర్, కనగర్తి, పిట్టల ఎల్లయ్యపల్లె, గోపరపల్లి, హరిపురం, లంబాడితండా, నాం సానిపల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఇద్లాపూర్, జాఫర్‌ఖాన్‌పేట, వెన్నంపల్లి గ్రామాల్లో అకాల వర్షానికి అపార నష్టం జరిగింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతోపాటు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో వర్షం పడింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో ధా న్యం తడిసింది. దీంతో ఆరుగాలం తాము పడ్డ కష్టమంతా నీళ్లపాలైందని అన్నదాతలు కన్నీరుపెట్టారు. అధికారులు సకాలంలో తూ కాలు వేసినట్లయితే ధాన్యం ఇలా తడిసేది కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని వారు కోరుతున్నారు.



వీర్నపల్లి : రంగంపేట కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యం కుప్పలు



రాజన్న సిరిసిల్ల పెద్దూరులోని ప్యాక్స్ సెంటర్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు



ఓదెల: కొలనూర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

## ఉద్యోగ ప్రకటన చూసి.. మూడు లక్షలు మునిగి

- మోసపోయిన వివాహిత
- నిందితుడి అరెస్ట్

గొల్లపల్లి, నవంబర్1: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం శంకర్‌రావుపేట గ్రామానికి చెందిన ఓ వివాహిత ఇంటర్ వరకు చదువుకున్నది. ఐదు నెలల క్రితం ఓ పెద్ద కంపెనీలో పార్టమ్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ వచ్చిన ప్రకటన చూసి వారిని సంప్రదించింది. వారి మాయమాటలు నమ్మింది. వారు చెప్పినట్టుగా ఆన్‌లైన్‌లో ₹3.19 లక్షలు పంపించింది. అయినా వారు ఉద్యోగం కల్పించకపోవడంతో మోసపోయానని గ్రహించింది. ఈ మేరకు గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరంగారెడ్డి, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ సతీశ్, సైబర్ ఏఆర్ ఎస్ఐ కృష్ణ టీమ్ టెక్నికల్ టీమ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లికి చెందిన గౌరీశంకర్‌ను నిందితుడిగా గుర్తించారు. ఈ మేరకు గౌరీశంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగం

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ఆటో డ్రైవర్ల చలో మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, నవంబర్ 1: కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమాగం అయ్యాయని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. రాష్ట్ర ఆటో డ్రైవర్ల యూనియన్ జేఏసీ ఛలో హైదరాబాద్ మహా ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం గోదావరిఖనిలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి ₹12వేల జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నా చేపట్టారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆటో డ్రైవర్లకు అండగా ఉంటుందన్నారు. ఇక్కడ కార్పొరేటర్ పెంట రాజేశ్, బీఆర్ఎస్ ఆటో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నీలరపు రవి, జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల సురేశ్, నాయకులు సదానందం కడార్ల శ్రీధర్, కోర్రి ఓదెలు, నామిండ్ల కుమార్, షరీఫ్, తిరుపతి, బైరి సంపత్, కొమురయ్య ఉన్నారు.